విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు పాటించాలి

- రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి
- మొయినాబాద్ మండలంలో రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన సదస్సు

మొయినాబాద్ : అప్పోజీగూడలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ జిల్లా అధికారి గీతారెడ్డి

మొయినాబాద్, మే 27 : రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తున్న సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని రంగారెడ్డి జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని చిలుకూరు, అప్పోజిగూడ, హిమాయత్‌నగర్, తోలుకట్టా, అప్పారెడ్డిగూడ గ్రామాల్లో రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ ద్వారా గుర్తింపు పొందిన ఫెర్టిలైజర్ దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. తప్పనిసరిగా రశీదు తీసుకోవాలని చెప్పారు. తీసుకున్న బిల్లులను విత్తనం విత్తి, పంట చేతికి వచ్చే సమయం వరకు జాగ్రత్తగా దాచి పెట్టాలని తెలిపారు. ఏ సమయంలోనైనా పంట నష్టపోతే బిల్లులు ఉంటే పంట నష్ట పరిహారం రావడానికి అవకాశముంటుందని చెప్పారు. గుర్తింపులేని కంపెనీల నుంచి విత్తనాలు కొనుగోలు చేసి నష్టపోవద్దని సూచించారు. డీలర్లు విత్తనాలను ఎమ్మార్పీ ధరలకే విక్రయించాలన్నారు. విత్తనాలను ఎక్కువ ధరకు అమ్మిన, నకిలీ విత్తనాలు అమ్మిన డీలర్లపై చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ ఏడీఏ రమాదేవి, మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, ఏఈవోలు కుమార్, సునీల్, పంచాయతీ కార్యదర్శులు వెంకటేశ్, జ్యోత్స్న, సంధ్య పాల్గొన్నారు.

లైసెన్సు ఉన్న డీలర్ షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలి

షాబాద్ : లైసెన్సు ఉన్న డీలర్ షాపుల్లోనే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని గీతారెడ్డి అన్నారు. విత్తనాలు కొనుగోలులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం శంకర్‌పల్లి మండలంలోని దోబీపేట్(మహలింగాపురం) గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. లూజు విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయరాదన్నారు. జిల్లావ్యాప్తంగా వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల డివిజన్ వ్యవసాయాధికారి రమాదేవి, శంకర్‌పల్లి మండల వ్యవసాయాధికారి సురేశ్‌బాబు, ఏఈవో రమ్య ఉన్నారు.

పద్మ పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ) : వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన వారికి భారత ప్రభుత్వం పద్మశ్రీ, పద్మ భూషణ్ అవార్డులను ప్రదానం చేయనున్నది. ఈమేరకు హైదరాబాద్ జిల్లాలోని సంబంధిత రంగాల్లో సేవలు అందించినవారు దరఖాస్తు చేసుకోవాలని, ఎంపికైన అభ్యర్థులకు 26 జనవరి 2025న ఢిల్లీలో జరిగే గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్రపతి ఈ అవార్డులను అందజేయనున్నట్లు జిల్లా యువజన , క్రీడా అధికారి సుధాకర్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు చెందిన అభ్యర్థుల నుంచి కళలు, సామాజిక కార్యక్రమాలు, పబ్లిక్ అఫైర్స్, సైన్స్, టెక్నాలజీ, ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ, వైద్యం, లిటరేచర్, విద్య, క్రీడలు సివిల్ సర్వీసెస్, ఇతర రంగాల్లో సాధించిన ప్రతిభను తెలియజేస్తూ..800 పదాలు మించకుండా దరఖాస్తులు కోరుతున్నట్లు చెప్పారు. ఈ నెల 31న సాయంత్రం 5 గటల లోపు హైదరాబాద్ జిల్లా అభ్యర్థులు, జిల్లా యువజన క్రీడా అధికారి కార్యాలయంలో, బీ-303, 3వ అంతస్తు, స్నేహ సిల్వర్ జూబ్లీ భవన్ కలెక్టరేట్ కాంప్లెక్స్ లక్డీకాపూల్‌లో నాలుగు దరఖాస్తులను సమర్పించాలని సూచించారు. ఇతర వివరాలకు https//padmaawards.gov.inలో సంప్రదించాలని సూచించారు.

మొక్కలను సంరక్షించాలి

జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

మొక్కలకు సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో కృష్ణారెడ్డి

యాచారం, మే 27 : నర్సరీలో పెంచుతున్న మొక్కలను సంరక్షించేందుకు కృషి చేయాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కృష్ణారెడ్డి అధికారులకు సూచించారు. మండలంలోని నందివనపర్తి గ్రామంలో ఆయన సోమవారం పర్యటించారు. గ్రామంలో నర్సరీలో పెంచుతున్న మొక్కలను స్వయంగా పరిశీలించారు. మొక్కల పెంపకానికి సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నర్సరీలో మొక్కల సంఖ్య, మొక్కల రకాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నర్సరీలో పెంచుతున్న ప్రతి మొక్కనూ సంరక్షించాలన్నారు. వేసవిలో మొక్కలు ఎండిపోకుండా ప్రతి నిత్యం సరిపడా నీరందించాలన్నారు. ఎండిపోయిన మొక్క స్థానంలో నూతన మొక్కను నాటాలన్నారు. హరితహారం టార్గెట్‌ను పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని సూచించారు. మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహించొద్దన్నారు. హరితహారాన్ని పకడ్బందీగా చేపట్టేందుకు ఇప్పటి నుంచే చర్యలు చేపట్టాలన్నారు. మండలంలోని ప్రతి నర్సరీలో మొక్కలను హరితహారానికి సిద్ధం చేయాలన్నారు. మండలంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. అధికారులు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కరానికి ప్రాధాన్యతనివ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో నరేందర్‌రెడ్డి, ఎంపీవో ఉమారాణి ఉన్నారు.

పుట్టపహాడ్ గ్రామపంచాయతీ కార్యాలయంలో విచారణ నిర్వహిస్తున్న ఫారెస్ట్ సెక్షన్ అధికారులు సాయికుమార్, ప్రవీణ్‌కుమార్

తునికాకు డబ్బులపై విచారణ

కులకచర్ల, మే 27 : కులకచర్ల మండల పరిధిలోని పుట్టపహాడ్ గ్రామంలో తునికాకుల విషయమై కొందరికి డబ్బులు వచ్చాయని, మరికొందరికి ఎందుకు రాలేదని గొడవలు జరుగుతున్న విషయాన్ని అటవీశాఖ అధికారులు జిల్లా డీఎఫ్‌వో ఆదేశాల మేరకు విచారణ నిర్వహించారు. అటవీశాఖ సెక్షన్ అధికారులు సాయికుమార్, ప్రవీణ్‌కుమార్ సోమవారం పుట్టపహాడ్ గ్రామానికి వెళ్లి విచారణ నిర్వహించారు. 2016 నుంచి 2021 వరకు తునికాకులు సేకరించిన వారి పేర 5గురికి ఒక్కొక్కరికి లక్షా ఎనిమిది వేల చొప్పున వారి ఖాతాల్లో డబ్బులు జమ కాగా.. మిగతావారికి ఎందుకు రాలేదని అధికారులను నిలదీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గతంలో గ్రామంలో తునికాకులు సేకరించిన ఐదుగురిని ఎంపిక చేసి వారి ఖాతాల్లో డబ్బులు జమచేశారని, విడతల వారీగా వస్తాయని తెలిపారు.

డబ్బులు నేరుగా ప్రభుత్వం నుంచి లబ్ధిదారుల ఖాతాల్లో పడతాయని తెలిపారు. కాగా దీనిపై అటవీశాఖ అధికారుల వివరణ కోరగా.. లేబర్ ఇన్సెంటివ్‌లు వారి ఖాతాల్లో ప్రభుత్వమే తమ శాఖ ద్వారా జమచేస్తుందని.. ఇందులో భాగంగానే లబ్ధిదారులకు డబ్బులు వారి ఖాతాల్లో పడ్డాయన్నారు. వారు ఇతరులకు ఇచ్చారు అనే దానిపై విచారణ నిర్వహించగా.. లబ్ధిదారులు తాము గ్రామంలో ఉన్న మినీ బ్యాంకు ద్వారా డబ్బులు తీసుకున్నామని.. ఎవ్వరికీ డబ్బులు ఇవ్వలేదని తెలిపారని పేర్కొన్నారు. విచారణ వివరాలను జిల్లా ఫారెస్ట్ అధికారికి అందజేస్తున్నట్లు వారు తెలిపారు.

రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, రాష్ట్ర డీజీపీ రవి గుప్తా తదితరులు. అలాగే రిహార్సల్స్ చేస్తున్న పోలీసులు

నిధుల దుర్వినియోగంపై రికార్డుల పరిశీలన

దోమ, మే 27 : నిధుల దుర్వినియోగంపై పూర్తి విచారణ చేసి నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తామని జిల్లా పంచాయతీరాజ్ అధికారి జయసుధ అన్నారు. పంచాయతీ నిధుల దుర్వినియోగం అభియోగ నేపథ్యాన్ని పురస్కరించుకొని ఆమె సోమవారం దోమ మండల పరిదిలోని రాకొండ గ్రామాన్ని ఎంపీవో సోమలింగంతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామంలో జరిగిన పలు రకాల పనులకు సంబంధించిన ఎంబీలు, బిల్లులు, ఓచర్లు తదితర రికార్డులను పరిశీలించడంతోపాటు క్షేత్ర స్థాయిలో పనుల నాణ్యతను కూడా పరిశీలించినట్లు పేర్కొన్నారు. గ్రామస్తులు కొన్ని పనులు నాసిరకంగా ఉన్నాయని తెలుపడంతో ఆ పనులకు సంబంధించిన వివరాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులకు రెఫర్ చేస్తామని తెలిపారు. అనంతరం ఆమె గ్రామంలో వివిధ వార్డులను పరిశీలించి సైడ్ డ్రైన్లలో పేరుకుపోయిన చెత్తను తీసి పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. కలెక్టర్‌కు ఇచ్చే నివేదిక ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆమె పేర్కొన్నారు.

రాకొండ గ్రామంలో పారిశుధ్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి జయసుధ

నేడు నేషనల్ టెక్నాలజీ డే సదస్సు

సిటీబ్యూరో, మే 27(నమస్తే తెలంగాణ) : నేషనల్ టెక్నాలజీ డే సందర్భంగా నేడు నిపుణులతో ఎన్‌జీఆర్‌ఐలో కీలకోపన్యాస సదస్సు జరుగనున్నది. 'అంటార్కిటికాలో దక్షిణ్ గంగోత్రి నిర్మాణం ఓ అద్భుతం' అనే అంశంపై పద్మశ్రీ గ్రహీత, ఎన్‌జీఆర్‌ఐ మాజీ డైరెక్టర్ ప్రొ.హర్ష్ కే.గుప్తా ప్రసంగించనున్నారు. ఎన్‌జీఆర్‌ఐలోని ఎస్‌బీ హాల్‌లో మధ్యాహ్నం మూడున్నర గంటలకు జరుగనున్నది. అటమిక్ ఎనర్జీ రెగ్యులేటరీ బోర్డు మెంబర్‌గా ఆయన వ్యవహరిస్తున్నారు.

ఈపీఎఫ్ సమస్యలకు సత్వర పరిష్కారం

సిటీబ్యూరో, మే 27(నమస్తే తెలంగాణ): ఈపీఎఫ్ సమస్యల సత్వర పరిష్కారానికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమం చేపడుతున్నట్లు జిల్లా నోడల్ అధికారి వరప్రసాద్ పేర్కొన్నారు. ప్రైవేటు రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల పీఎఫ్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు సోమవారం నిధి ఆప్కే నిఖత్ 2.0 పేరిట ప్రత్యేక సెషన్ నిర్వహించినట్లు తెలిపారు. మాదాపూర్‌లోని శ్రీసాయి ప్లాజాలోని శ్రీ చైతన్య స్కూల్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు. పీఎఫ్ సమస్యలు పరిష్కరించేందుకు కేవైసీ, పేరు, పుట్టిన తేదీ సవరణలకు కృషి చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సోషల్ సెక్యూరిటీ అసిస్టెంట్ మేఘరాజు, శ్రీ చైతన్య స్కూల్ ఉద్యోగులున్నారు.

యాదాద్రి కాలనీలో అక్రమ నిర్మాణాన్ని కూల్చివేస్తున్న విజిలెన్స్ అధికారులు

అక్రమ నిర్మాణం కూల్చివేత

బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి యాదాద్రి కాలనీలో రోడ్డుకు అడ్డుగా నిర్మించిన ప్రహరీని విజిలెన్స్ అధికారులు సోమవారం కూల్చివేశారు. యాదాద్రి కాలనీలో కొందరు బిల్డర్లు రోడ్డును ఆక్రమించి గోడ నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బందులేర్పడుతున్నాయి. స్థానిక నాయకులకు, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా పట్టించుకోక పోవడంతో హెచ్ఎండీఏ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు సోమవారం టౌన్‌ప్లానింగ్ అధికారులతో కలిసి కూల్చివేశారు. దీంతో కాలనీవాసులు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. - బండ్లగూడ

రాంకీ కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలి

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ) : జీహెచ్ఎంసీలో పనిచేస్తున్న కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, రాంకీకి ఇచ్చిన కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం వద్ద ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, టీజేఏసీ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జీహెచ్ఎంసీలో అన్ని విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, అప్పటి వరకు కార్మికులందరికీ సమాన పనికి సమాన వేతనం కల్పించాలని కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. రాంకీకి ఇచ్చిన కాంట్రాక్ట్ విధానాన్ని రద్దు చేసి యథా విధిగా జీహెచ్ఎంసీ చెత్త సేకరించాలన్నారు. ఎన్నికల కోడ్ తర్వాత కార్మికులతో కలిసి జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తామని ఏఐటీయూసీ మున్సిపల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, కార్యదర్శి చర్లపల్లి రాములు, నర్సింహులు, జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజేఏసీ నాయకులు ఆకుల శ్రీను, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు హెచ్ఎండీఏ అధికారులతో సీఎం సమీక్ష సమావేశం

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్ మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యకలాపాలపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి మంగళవారం సమీక్ష చేయనున్నారు. హైదరాబాద్ నగర విస్తరణ ఔటర్ రింగు రోడ్డు దాటి విస్తరిస్తున్న నేపథ్యంలో భవిష్యత్తు కార్యాచరణ, ఇప్పటి వరకు చేపట్టిన ప్రాజెక్టుల పురోగతి, కొత్తగా నిర్మించే రీజినల్ రింగు రోడ్డు వరకు హెచ్ఎండీఏ పరిధి, విస్తరణ వంటి అంశాలను సీఎం సమీక్షించనున్నారు. ప్రస్తుతం పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రిత్వ శాఖ సీఎం వద్దే ఉంది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 6 నెలలు కావస్తుండటంతో హెచ్ఎండీఏ భవిష్యత్ కార్యాచరణే లక్ష్యంగా అధికారులతో చర్చించనున్నారు. ఎంఏయూడీ ప్రిన్సిపల్ సెక్రెటరీ, హెచ్ఎండీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ దాన కిశోర్, జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ అమ్రాపాలితో పాటు పలు విభాగాల ఉన్నతాధికారులు సమీక్షా సమావేశంలో పాల్గొననున్నారు. సమీక్షా సమావేశాన్ని నానక్‌రాంగూడ ఓఆర్ఆర్ ఇంటర్‌చేంజ్ వద్ద ఉన్న హెచ్‌జీసీఎల్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సమాచారం. హెచ్ఎండీఏతో పాటు హైదరాబాద్ నగరానికి సంబంధించి ఇతర శాఖలతోనూ సీఎం చర్చించే అవకాశం ఉన్నది.

ఎంబీఏ కోర్సుల పరీక్షా ఫలితాల విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ, మే 27 : ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంబీఏ కోర్సుల పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (ఈవినింగ్) సెమిస్టర్ పరీక్షా ఫలితాలను విడుదల చేశారు. ఫలితాల కోసం ఓయూ వెబ్‌సైట్‌లో చూసుకోవాలని సూచించారు.

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఓయూ పరిధిలో వివిధ కోర్సుల పరీక్ష తేదీలను అధికారులు ఖరారు చేశారు. పోస్ట్ ఎమ్మెస్సీ డిప్లొమా ఇన్ రేడియోలాజికల్ ఫిజిక్స్ మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను వచ్చే నెల 7 నుంచి, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆరో సెమిస్టర్ రెగ్యులర్, ఎల్ఎల్‌బీ ఆనర్స్ ఆరో సెమిస్టర్ రెగ్యులర్, ఐదేళ్ల లా కోర్సుల పదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను 11 నుంచి నిర్వహించనున్నారు.

ఎంఫార్మసీ పరీక్షా తేదీల మార్పు

ఓయూ పరిధిలోని ఎం ఫార్మసీ పరీక్ష తేదీలను మార్చినట్లు అధికారులు తెలిపారు. ఎం ఫార్మసీ మొదటి, మూడో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, రెండో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షలను వచ్చే నెల 6 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు. కానీ వివిధ కారణాల రీత్యా వాటిని వా యిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలను తిరిగి వచ్చే నెల 11 నుంచి నిర్వహించనున్నట్లు అధికారులు చెప్పారు.

విద్యతోనే సంస్కారం

- త్రిదండి చినజీయర్ స్వామి
- ముగిసిన వేసవి శిక్షణా తరగతులు
- ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

ఆమనగల్లు, మే 27 : భారతదేశం సంస్కృతి, సంప్రదాయాలతో పాటు ఆధ్యాత్మికతకు పుట్టినిల్లు అని త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. కృతిలయ కల్చరల్ అకాడమీ, వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో విద్యార్థులకు నెల రోజుల పాటు ఏర్పాటు చేసిన శిక్షణా తరగతుల ముగింపు కార్యక్రమం విఠాయిపల్లిలోని బీఎన్ఆర్ గార్డెన్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి చినజీయర్ స్వామి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి ముఖ్య అతిథులుగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా చినజీయర్ స్వామి మాట్లాడుతూ.. విద్యతోనే ఉన్నత జీవితం, సంస్కృతి, సంప్రదాయం, సంస్కారం అలవడుతాయన్నారు. విద్యార్థులకు ఇలాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని, ఈ కార్యక్రమాల వల్ల విద్యార్థులకు సమాజం పట్ల అవగాహన కలుగుతుందన్నారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకుని భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని ఆయన పేర్కొన్నారు. ఆధ్యాత్మికతతో విద్యార్థులు సన్మార్గంలో పయనిస్తారని ఎమ్మెల్యే కసిరెడ్డి, నారాయణరెడ్డి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో నాగర్‌కర్నూల్ జడ్పీ వైస్ చైర్మన్ లాగూర్ బాలాజీసింగ్, కృతిలయ కల్చరల్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్ దాస్, వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర కార్యదర్శి మాధవరెడ్డి, జడ్పీటీసీ వెంకటేశ్, వందేమాతరం ఫౌండేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నర్సిరెడ్డి, లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు రాము, మాజీ సర్పంచ్ కుమార్, నాయకులు వరప్రసాద్‌రెడ్డి, జగన్, కృష్ణానాయక్, శ్రీశైలం, మెకానిక్ బాబా, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న త్రిదండి చినజీయర్ స్వామి. వేదికపై ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి

కార్యక్రమానికి హాజరైన చిన్నారులు, వారి తల్లిదండ్రులు

సాంస్కృతిక నృత్యాలు చేస్తున్న చిన్నారులు

జూన్ 3 నుంచి 'పది' అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు

సిటీబ్యూరో, మే 27, (నమస్తే తెలంగాణ): పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలను సజావుగా నిర్వహించాలని హైదరాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ పాటిల్ హేమంత కేశవ్ అధికారులను ఆదేశించారు. సోమవారం అదనపు కలెక్టర్ చాంబర్‌లో పది అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల ఏర్పాట్లపై నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జూన్ 3 నుంచి 13 వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్న పది సప్లిమెంటరీ పరీక్షలో 12,186 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని, 35 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్ష సమయంలో 144 సెక్షన్ అమలు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ వస్తువులు తీసుకువెళ్లేందుకు అనుమతి లేదన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ముందుగానే చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాధికారి ఆర్ రోహిణి, డీసీపీ ఎం.బాపూరావు, టీఎస్ ఆర్టీసీ డిప్యూటీ ఆర్ఎం కే.మహేశ్ కుమార్, డీపీఆర్వో అబ్దుల్ కలీం, డీఎం అండ్ హెచ్ ఓపీఓ డాక్టర్ సుధా మాధవి పాల్గొన్నారు.

రేపటి నుంచి బాల సాహిత్య సమ్మేళనం

తెలుగు యూనివర్సిటీ, మే 27 : తెలంగాణ సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో ఈ నెల 29, 30 తేదీల్లో బాలసాహిత్య సమ్మేళనం నిర్వహించనున్నట్లు పరిషత్తు ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోడూరు శాంతమ్మ స్మారకార్థం శాంతావసంతట్రస్టు అధ్యక్షుడు డాక్టర్ కె.ఐ వరప్రసాదరెడ్డి నిర్వహణలో జరుగుతున్న బాలసాహిత్య సమ్మేళనంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు రెండు వందల మంది బాల సాహితీవేత్తలు, రచయితలు, తెలుగు ఉపాధ్యాయులు పాల్గొంటారని తెలిపారు. బడిలో తెలుగు భాష, బాల సాహిత్యం-పత్రికలు, కథ చెప్పే కళ, సంగీతం, నృత్యం, నాటకం, చిత్రలేఖనం, శిల్ప, జానపద కళల పరిచయం, బాల సాహిత్యం-ప్రమాణాలు, బాలసాహిత్యం-గ్రంథలయాలు తదితర అంశాలపై చర్చాగోష్ఠి, సదస్సులు జరుగుతాయన్నారు. బాలల సమగ్ర వ్యక్తిత్వ వికాసం కోసం.. సాహిత్య వైభవం, ఆరోగ్యం-విజ్ఞానం గ్రంథాలతో పాటు పిల్లల కోసం పిల్లలు రాసిన కథల ఐదు సంపుటాలను ఈ సందర్భంగా ఆవిష్కరిస్తారని చెప్పారు.



జలమండలి ప్రధాన కార్యాలయంలో వినతిపత్రం సమర్పిస్తున్న ఔట్ సోర్సింగ్ సిబ్బంది

ఔట్ సోర్సింగ్ కార్మికులకు జీతాలు పెంచండి

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ) : జలమండలిలో ఔట్ సోర్సింగ్ కార్మికులకు వెంటనే కేటగిరి మార్చి జీతాలు పెంచాలని జలమండలి కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు నారాయణ కోరారు. సోమవారం ఖైరతాబాద్ జలమండలి ప్రధాన కార్యాలయంలో ఎండీ సుదర్శన్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీధర్‌బాబును కలిసి వినతిపత్రం సమర్పించారు. జీవో నం.60లో కేటగిరి 2లోకి మార్చి వేతనాలు పెంచాలని, ఎంఓఎం కార్మికులకు మెయింటెనెన్స్ సేవలు, మ్యాన్ పవర్ సేవల నుంచి వేరు చేసి జీతాలివ్వాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎండీ వివరాలను తీసుకొని చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులున్నారు.

ఆపరేషన్‌కు డబ్బులు డిమాండ్

సిటీబ్యూరో, మే 27 (నమస్తే తెలంగాణ): సర్జరీ చేసేందుకు ఒక వైద్యుడు డబ్బులు డిమాండ్ చేసినట్లు వచ్చిన ఆరోపణలపై విచారణ షురువైంది. గాంధీ దవాఖానలో త్వరగా శస్త్రచికిత్స జరిపేందుకు ఒక వైద్యుడు రోగి వద్ద డబ్బులు డిమాండ్ చేసినట్లు వారం రోజుల కిందట దవాఖాన సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు అందిన విషయం తెలిసిందే. దీనిని సీరియస్‌గా తీసుకున్న గాంధీ సూపరింటెండెంట్ డాక్టర్ రాజారావు వచ్చిన ఫిర్యాదుపై నాలుగు విభాగాలకు చెందిన ప్రొఫెసర్లతో కూడిన కమిటీతో విచారణకు ఆదేశించారు. ప్రత్యేక కమిటీ విచారణను ప్రారంభించినట్లు సమాచారం. ఒకటి రెండు రోజుల్లో విచారణకు సంబంధించిన నివేదికను కమిటీ సూపరింటెండెంట్‌కు సమర్పించనున్నది.